## క్లుప్తంగా...

### సీసీ కెమెరాల ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**శంషాబాద్ రూరల్:** మండలంలోని మదన్‌పల్లి పాతతండాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్, ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

**మణికొండ:** మణికొండ మున్సిపాలిటీ, హుడా కాలనీలోని డాక్టర్ ఆర్‌కే క్లినిక్స్, డాక్టర్ ఏఆర్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మణికొండ ప్రధాన కార్యదర్శి టి. రమేష్‌బాబు తెలిపారు. జనరల్ మెడిసిన్‌తో పాటు బీఎండీ పరీక్షలను నిర్వహిస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..**

**మణికొండ:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గార్డెన్ కాలనీలో ఆదివారం సాయంత్రం 6గంటలకు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి తెలిపారు.

### ట్రిపుల్ ఐటీలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు

**రాయదుర్గం:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ కోసం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు శనివారం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, గోల్డ్‌మన్‌సాచ్‌లు సంయుక్తంగా నిర్ణయించారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ జవహర్ మాట్లాడుతూ గోల్డ్ మ్యాన్ సాచ్ సహకారంతో ఏఐ యొక్క అప్లికేషన్స్, ఫైనాన్స్ రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు కనపిస్తాయన్నారు. గోల్డ్‌మ్యాన్ సాచ్స్ సర్వీసెస్ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవికృష్ణన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కొత్త సాంకేతికతలు, పరిష్కారాల అభివృద్ధికి పరిశ్రమ, విద్య భాగస్వామ్యాలు కీలకంగా ఉన్నాయన్నారు.

### నేడు 'ఐఎస్‌బీ'లో పుస్తకావిష్కరణ

**రాయదుర్గం:** గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఆదివారం నూతన పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుంది. కేమ్కా ఆడిటోరియంలో సాయంత్రం 4.30 గంటలకు హరప్పా ఎడ్యుకేషన్ చైర్మన్, ఐఎస్‌బీ వ్యవస్థాపక డీన్ డాక్టర్ ప్రమత్‌రాజ్‌సిన్హా 'లెర్న్, జోస్ట్ స్టడీ' పేరిట రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్‌పిల్లుట్లతో డాక్టర్ సిన్హా ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది.

### నూతన కార్యవర్గం

**రాయదుర్గం:** నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు .అధ్యక్షుడిగా సీకే మహ్మద్ షరీఫ్, ఉపాధ్యక్షులుగా రేష్మాసమల్, అంజన్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్ రచనారెడ్డి, అజయ్‌కుమార్, కార్యదర్శులుగా షైన్‌మారియా, బాసిల్ జార్జ్, మహ్మద్ ఫయాజుల్‌హక్, ముకుంద్‌కుమార్, శాశ్వత ఆహ్వానితులుగా అమల్ జోస్‌ఫిలిప్, సీఎం సునీల్‌కుమార్, చాణక్య, సయూజ్అబ్రహం, కోశాధికారిగా సంగీత్‌ఆర్‌నాయర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్‌గా జర్నా పాధ్యాయ్, మహ్మద్‌నద్రన్, కార్యవర్గ సభ్యులుగా కెబిశ్రీరామ్, ఖాలీద్,శ్యాంసన్ గిడ్లా, దావిస్‌జేఅల్బ్రత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సీకేమహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

### నేడు 'మంచినీళ్ల పండుగ'

**గచ్చిబౌలి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆదివారం 'మంచినీళ్ల పండుగ' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఉదయం 10 గంటలకు మియాపూర్ డివిజన్‌లోని జేపీఎన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

### బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**గోల్కొండ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ 9 సంవత్సరాల పరిపాలనలో సాధించిన విజయాలపై బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. సబ్ కాసాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పడాల అనంతకృష్ణ, శ్యాంలింగం, పడాల అనంతకృష్ణ, అశ్విన్ మోదీ తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

**ఏజీవర్సిటీ:** యువతకు సరైన మార్గంలో దిశానిర్దేశం చేస్తే దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని పశ్చిమబెంగాల్‌లోని బిధాన్ చంద్ర కృషి అగ్రికల్చర్ విశ్వవిద్యాలయ మాజీ వైఎస్ చాన్స్‌లర్ డాక్టర్ రంజిత్‌కుమార్ సమంట అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వార్షికోత్సవం నిర్వహించగా.. ఆయన పాల్గొన్ని మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ఏదైనా సాధించేందుకు సాధ్యం అవుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవత్వంతో కూడిన చదువులు విద్యార్థులకు ఎంతో అవసరమని వారిని ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు స్మార్ట్ ఎడ్యుకేషన్‌ను అవలంబించాలన్నారు. ప్రతి విద్యార్థి కాలనుగుణంగా వస్తున్న శాస్త్ర సాంకేతికతను అవగతం చేసుకుని విశ్వవ్యాప్తంగా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఉద్యాన పంటలలో వస్తున్న స్మార్ట్ ఇరిగేషన్ డ్రోన్ టెక్నాలజీ మేకనైజేషన్ వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు సరైన లక్ష్యాన్ని నిర్ణయించుకుని దాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం డీన్ రాజశేఖర్, అసోసియేట్ డీన్ చీనానాయక్, ప్రశాంత్, వెంకటలక్ష్మి, సాయికృష్ణ, కళాధర్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

### కేంద్రమంత్రులకు సన్మానం



కేంద్రమంత్రులను సన్మానిస్తున్న స్థానిక నేతలు

**రాజేంద్రనగర్:** నారమ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, సహాయ మంత్రి కైలాష్‌చౌదరీలు హాజరయ్యారు. రైతుల ట్రైనింగ్ సెంటర్, బాలికల హాస్టల్, సిబ్బంది భవనాలకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ నేతలు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు టి.అంజన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి కొమురయ్య, నాయకులు నగేష్, డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### రైతు శిక్షణ కేంద్రానికి భూమిపూజ..



భూమి పూజ చేస్తున్న కేంద్ర మంత్రులు

**ఏజీవర్సిటీ:** జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ సంస్థ (నారమ్స్)లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కై లాష్ చౌదరీ రైతులకు వ్యవసాయంలో నూతన పద్ధతుల్లో శిక్షణను ఇచ్చేందుకు శిక్షణ కేంద్రం, బాలికల హాస్టల్ భవనానికి భూమిపూజ చేశారు. జీ20 కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ వచ్చిన వారు నారమ్స్‌లోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ హిమాంషు పఠాక్, నారమ్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌ను చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ల సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్ అన్నారు. డివిజన్‌లోని విద్యానగర్ వై జంక్షన్ నుంచి బీమా విష్ణుపురికాలనీ వరకు రూ.20 లక్షలతో జరుగుతున్న సీసీరోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిల సహకారంతో 1వ డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యధికంగా రూ.7,34,70,000లతో అభివృద్ధి పనులను నిర్వహించామన్నారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం, 60 గజాల వాకర్‌సెక్షన్ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీనికి ప్రత్యేక కార్యచరణ, ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోనే అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## బుద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన



డాక్టర్లతో ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ వరధాచారి

**రాజేంద్రనగర్:** బుద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిని రంగారెడ్డి జిల్లా వైద్య విధాన పరిషత్ జిల్లా హెడ్ క్వార్టర్ ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ వరధాచారి సందర్శించారు. శనివారం ఉదయం ఆయన ఆసుపత్రికి చేరుకుని ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో అందిస్తున్న డాక్టర్లతో పాటు నర్సులు, రోగులను అక్కడి పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో జెండా ఎగురవేశారు. ఆసుపత్రి సూపరెంటెండ్ డాక్టర్ సుగుణ, డాక్టర్ సరస్వతి, పద్మావతి, మరియమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ యాజమాన్యంపై రైతులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న రైతులు

**ఏజీవర్సిటీ:** రైతులు కూరగాయల విత్తనాలను ఆధునిక పద్ధతిలో వినియోగించుకోవడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటలను అందించవచ్చని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నరేంద్రరెడ్డి అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఉద్యాన పంటల్లో నర్సరీ యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేబీ ఈశ్వరి పాల్గొని రైతులకు నారు మళ్లపై పలు సలహాలు, శిక్షణలు ఇచ్చారు. నారు మడిని అధునిక పద్ధతుల ద్వారా పెంచుకోవాలని సూచించారు. సాంకేతిక శిక్షణలో రైతులకు ప్లగ్ ట్రే విధానంలో కూరగాయల విత్తనాల వినియోగంపై రైతులకు వివరించారు. మామిడిలో అంటుకట్టు విధానం ద్వారా మొక్కల పెంపకంపై వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల రైతులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమానికి కృషి



గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**ఘనంగా తెలంగాణ గిరిజనోత్సవాలు**



పెద్దతూప్రతండాలో పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న దృశ్యం

**శంషాబాద్ రూరల్:** తెలంగాణ రాష్ట్రం గిరిజన సంక్షేమం దిశగా వెళ్తుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం తెలంగాణ గిరిజన దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని పెద్దతూప్ర తండా, మదన్‌పల్లి పాత తండాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గిరిజన సంప్రదాయ నృత్యంతో స్థానికులు ఎమ్మెల్యేకు స్వాగతం పలకగా.. ఆయన వారితో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజనులు దశాబ్దాల కలను నెరవేరుస్తూ.. తండాలు, గూడెంలను సీఎం కేసీఆర్ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రిజర్వేషన్లు పెంచడంతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మదన్‌పల్లి పాతతండా, పెద్దతూప్రతండాలో కొత్తగా నిర్మించిన పంచాయతీ భవనాలను ప్రారంభించారు. పెద్దతూప్రతండాలో పాఠశాల అదనపు తరగతి గదుల ప్రారంభం, సీసీ రోడ్లు, మురుగు కాలువ పనులను ప్రారంభించారు. సర్పంచ్‌లు రవినాయక్, హన్లీ, ఎంపీపీ జయమ్మ, వైఎస్ ఎంపీపీ నీలం, జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

### కాలినడకన యాదగిరిగుట్టకు..

**రాయదుర్గం:** గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడ నుంచి యాదగిరిగుట్టకు దాదాపు 100 కిలోమీటర్లు కాలి నడకన బయలుదేరారు ఇద్దరు సోదరులు. నానక్‌రాంగూడకు చెందిన నింబాలి జైదీప్ సింగ్, ఆయన సోదరుడు వినయ్‌సింగ్ ఇద్దరూ నడుచుకుంటూ శనివారం యాదగిరిగుట్టకు చేరుకున్నారు. ఆదివారం మొక్కు తీర్చుకుంటామని, 14 గంటల పాటు నడిచామని వారు పేర్కొన్నారు.

### చెత్త సమస్యను పరిష్కరించండి

**అత్తాపూర్:** అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోజు రోజుకు చెత్త సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హుడాకాలనీలో రోడ్లపై ఇష్టానుసారంగా చెత్తను పారవేసి వాటిని తొలగించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకుని ఓపెన్ పాయింట్‌ను పూర్తిగా తొలగించాలని కోరారు.

### యోగానంద్ వాహనంపై దాడి

గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదు





**గచ్చిబౌలి:** బీజేపీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గజ్జెల యోగానంద్‌తో పాటు పార్టీ నాయకుల కార్లపై దాడి చేశారు. మీ సమస్య– మా పోరాటంలో భాగంగా శుక్రవారం రాత్రి 7.30 గంటలకు మసీద్‌బండలో పాదయాత్ర చేపట్టారు. వార్డు కార్యాలయం ముందు కార్లను పార్క్ చేశారు. యోగానంద్‌కు చెందిన ఫార్చ్యూనర్‌తో పాటు బ్రీజా, ఎర్టిగా, స్విఫ్ట్ కార్లపై ఒక వర్గం వారు రాళ్లు విసరడంతో కార్ల అద్దాలు పగిలిపోయాయి. ఇరు వర్గాలు బాహాబాహికి దిగడంతో గచ్చిబౌలి పోలీసులు చెదరగొట్టారు. కాగా ఆదిత్య, అరుణ్ కుమార్ అనే వ్యక్తులు పాపిరెడ్డి కాలనీకి చెందిన బీజేపీ నాయకురాలు కాంచన తమపై, కార్లపై దాడి చేశారని గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీలు సేకరిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### జాతీయ నాయకుల చిత్రపటాల అందజేత



**శంషాబాద్ రూరల్:** మండలంలోని పెద్దగోల్కొండలో కొత్తగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేయడానికి బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో దేశ నేతల చిత్రపటాలను సర్పంచ్ లక్ష్మయ్యకు అందజేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఓబీసీ మోర్చా రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ ఆనెగోని భాస్కర్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు ఎస్.సురేష్‌యాదవ్, మండల జనరల్ సెక్రటరీ వెంకటేష్‌గౌడ్, నాయకులు స్వామి, లక్ష్మణ్‌దాస్, భజన్‌దాస్, రాఘవేందర్, శ్రీధర్, నవీన్, అల్లుఅర్జున్, కార్తిక్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**రాజేంద్రనగర్:** బుద్వేల్‌లోని వీరభద్రస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాలయ కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈనెల 19న మహాకాళి సమేత వీరభద్రస్వామి, గణపతి, సుబ్రహ్మణ్య దేవాలయంలో బలిపీఠ ప్రతిష్ఠతో పాటు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు.

## సాక్షి ఎఫెక్ట్.. చెత్త సమస్యకు పరిష్కారం !



నాడు చెత్తాచెదారాలతో..

**రాజేంద్రనగర్:** రోడ్డు పక్కన పారబోస్తున్న చెత్తాచెదారాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. శుక్రవారం 'మున్సిపాలిటీ చెత్త జీహెచ్ఎంసీలో' అనే శీర్షికన సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు పారిశుద్ధ్య సిబ్బంది జేసీబీ, టిప్పర్లు, కార్మికులు చెత్తాచెదారాలను తొలగించి ఈ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు.



నేడు శుభ్రం చేసిన దృశ్యం

# ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం



పద్మశ్రీహిల్స్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్

**బండ్లగూడ:** ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతిపాపయ్య యాదవ్ వెల్లడించారు. పద్మశ్రీహిల్స్‌లో రూ.70 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా ఉన్న డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటికి తొలి ప్రాధాన్యమిస్తూ.. సకాలంలో పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

### విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న దృశ్యం

**గచ్చిబౌలి:** పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించకపోతే పలు సమస్యలు ఉత్పన్నం అవుతాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో నిర్వహించిన పోటీలలో విజేతలకు శనివారం ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్ పర్యవేక్షణలో విజయకుమార్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు . కాగా పర్యావరణ పరిరక్షణ అంశంపై పోస్టర్ తయారీ, స్లోగన్ రైటింగ్, వీడియో మేకింగ్ పోటీలలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### పాత మిలటరీ క్వార్టర్స్ వారికి న్యాయం జరిగేలా కృషి

**గోల్కొండ:** గోల్కొండ ఎండీ లైన్స్‌తో పాటు కార్వాన్ నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న పాత నిజాం మిలటరీ క్వార్టర్స్ యజమానులకు న్యాయం చేపిస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం మహ్మదీ లైన్స్ చౌరస్తా వద్ద పాత మిలటరీ క్వార్టర్స్ యజమానుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ అధినేత హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చొరవతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పాత మిలటరీ క్వార్టర్స్‌ను అప్పటి నిజాం సైన్యం వారికి కేటాయించే విధంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం సైతం మజ్లిస్ పార్టీ ప్రాతినిత్యంతో క్వార్టర్స్‌ను వాటి యజమానులకు కేటాయించేందుకు జీవో జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్ ఫరాన్ పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాలు సిద్ధం

- ఈ ఏడాది నుంచి నోట్‌బుక్స్ కూడా అందజేత
- దశాబ్ది ఉత్సవాల్లో 20న అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేత



పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

**శేరిలింగంపల్లి:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మొత్తం 59 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను అందించనున్నారు. మండల విద్యాధికారి వెంకటయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందేలా చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు ప్రారంభించింది.

**లక్ష అవసరం.. అందుబాటులో 74వేల పుస్తకాలు**

- శేరిలింగంపల్లి మండలంలో 43 ప్రాథమిక పాఠశాలలు, మూడు యూపీఎస్, 13 జెడ్పీహెచ్ఎస్ స్కూల్స్ ఉండగా లక్ష పుస్తకాలు అవసరమవుతాయని అధికారుల అంచనా.
- అందుకు అణుగుణంగా మొదటి విడత 41వేల పుస్తకాలు రాగా రెండో విడత 33వేల పుస్తకాలు వచ్చాయి. రెండు విడతల్లో 74 వేల పుస్తకాలు రెడీ అయ్యాయి. ఇక చివరి విడతలో 26వేల పుస్తకాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఈ ఏడాది 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలను కూడా అందించనున్నారు.
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేరోజు పుస్తకాలను అందించేందుకు ప్రణాళిక రూపొందించారు.
- కాగా పాఠశాల తెరిచే రోజే విద్యార్థులకు నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్ అందించేలా ఏర్పాట్లు చేయాలి.

### అన్ని ఏర్పాట్లు పూర్తి



శేరిలింగంపల్లిలోని 59 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న పుస్తకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభు త్వం ఈ ఏడాది 6 తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలను కూడా ఇవ్వనుంది. – కె.వెంకటయ్య, మండల విద్యాధికారి, శేరిలింగంపల్లి